క్లుప్తంగా

పరుగు పందెంలో విద్యార్థినుల ప్రతిభ



అయిజ: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన 100 మీటర్ల పరుగు చాంపియన్ షిప్‌లో మండలంలోని భూంపురం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. అండర్ 14 విభాగంలో మహేశ్వరి 3వ స్థానంలో, మానస 4వ స్థానంలో, అండర్ 16 విభాగంలో నవిత 3వ స్థానంలో, అండర్ 18 విభాగంలో అనూష 2వ స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు నిర్వాహకులు సర్టిఫికెట్స్‌తో మెడల్స్‌ను అందజేశారు. విద్యార్థినులను భూంపురం పాఠశాల హెచ్‌ఎం భీమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, పలువురు అభినందించారు.

దళితుల పొలాల్లో చెక్ పోస్టును తొలగించాలి



కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె వద్ద పోలీసులు అక్రమంగా దళితుల పొలాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును తొలగించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మాచర్ల ప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం చెక్ పోస్ట్ ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. గ్రామానికి చెందిన దళితులు చుక్క నరిసంహులు, చుక్కా హుస్సేన్‌లకు సంబంధించిన సర్వే నంబర్ 269/3సీ/2లో గల భూమిలో ఎలాంటి అనుమతి లేకుండా షెడ్‌లను ఏర్పాటు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రాజోళి: మండలంలోని తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ కుర్మయ్య తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు రెండు ట్రాక్టర్ల ద్వారా తుంగభద్ర నది నుంచి సోమవారం తెల్లవారుజామున శాంతిగనర్ వైపు ఇసుకను తరలిస్తున్నారు. పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు వాటిని పట్టుకుని విచారించగా, ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పంటల పరిశీలన



ధరూరు: అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతుల పంట పొలాలను హార్టికల్చర్ అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించారు. సోమవారం మండలంలోని బూరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు ఆనంద్‌రెడ్డి సాగుచేసిన మునగతోటను పరిశీలించారు. రెండు రోజుల కిందట గాలివాన బీభత్సం సృష్టించి తోటలు, పంటలను అతలాకుతలం చేసిన విషయం తెలిసిందే. ఆరున్నర ఎకరాల్లో సాగు చేసిన మునగ తోటలో విరిగిన చెట్లను హార్టికల్చర్ అధికారి శ్రీనివాసా చారి పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు వివరిస్తామని పేర్కొన్నారు.

పనులు వేగవంతం చేయండి



అయిజ: పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో ప్రధాన రోడ్డుపై నిర్మిస్తున్న సెంట్రల్ లైటింగ్ సిస్టం పనులను సోమవారం మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డివైడర్‌పై ఏర్పాటు చేస్తున్న హైమాస్ట్ విద్యుత్ బల్బుల ఏర్పాటు పనులు వేగంగా పూర్తిచేయాలని నిర్వాహకులను ఆదేశించారు. కాంట్రాక్టర్‌కు పలు సలహాలు, సూచనలు చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన సెర్ఫ్ ఉద్యోగులు

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహంను సెర్ఫ్ ఉద్యోగులు సోమవారం కలిశారు. పేస్కేల్ కోసం కృషి చేసిన ఎమ్మెల్యేకు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేకు మిఠాయి తినిపించి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం పారిజాత, శోభారాణి, సీసీలు నాగేశ్వరి, చిట్టెమ్మ, జయమ్మ, సునంద, బీచుపల్లి, తిమ్మప్ప, రవి, విజయ్ కుమార్, బుచ్చన్న, ఈదన్న తదితరులు ఉన్నారు.

ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొడదాం

గట్టు: ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా మిట్టదొడ్డిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గతంలో మండలం నుంచి ఉపాధి కోసం కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాలకు వలస వెళ్లేవారని బీఆర్‌ఎస్ పాలనతో వలసలు తగ్గుముఖం పట్టాయన్నారు. మండలంలో సుమారు రూ.380 కోట్ల నిధులు కేటాయించి వివిధ అభివృద్ధి పనులు పూర్తిచేశామన్నారు. తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో స్టేట్ కన్స్యూమర్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడ్, ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, రామకృష్ణారెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు బల్గెర హనుమంతు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి లింగాపురం సర్పంచ్

మండలంలోని మిట్టదొడ్డి స్టేజీ దగ్గర సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాపురం సర్పంచ్ సూర్యగౌడ్ బీజేపీ నుంచి బీఆర్‌ఎస్ గూటికి చేరారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సర్పంచ్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

గద్వాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకొని ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం జూనియర్ ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో 300 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీధర్‌గౌడ్, పాఠశాల హెచ్‌ఎం విష్ణు, బాబర్, చెన్నయ్య, వార్డు కౌన్సిలర్ కృష్ణ, ఎన్టీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు చిరుముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన ఎమ్మెల్యే

అలంపూర్: కర్నూల్‌లో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీగా ఎన్నికకావడంతో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 21వ తేదీన వడ్డేపల్లి మండలం తనగలలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి హాజరుకావాలని ఎమ్మెల్సీని ఎమ్మెల్యే ఆహ్వానించారు. అదేవిధంగా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని ఏపీఐడీసీ డైరెక్టర్ పటేల్ హనుమంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా వడ్డేపల్లి మండలం తనగల గ్రామానికి చెందిన లతీష్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. నియోజకవర్గంలోని డి-బూడ్డిపాడు, అలంపూర్, కోనేరు, ఓహెచ్‌బీడీ పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఉండవెల్లి మండలంలోని మిషన్ భగీరథ కార్మికులు ఎమ్మెల్సీ చల్లాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో జెడ్పీటీసీ రాజు, ఆర్డీఎస్ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ తనగల సీతారామిరెడ్డి, కలుగోట్ల పీఏసీఎస్ మాజీ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మారెన్నలతోపాటు వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.



ఎమ్మెల్సీ చల్లాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం



మానవపాడు: అలంపూర్ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పెద్దఆముదలపాడు, నారాయణపురం, అమరవాయి, మానవపాడు గ్రామాలలో హాథ్ సే హాథ్ జోడో యాత్రను కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాలల్లో పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, పరమేష్ రాజేంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతలు ఉన్నా సాగునీరు కరువు



మాట్లాడుతున్న వెంకటస్వామి

అలంపూర్: నాలుగు ఎత్తిపోతల పథకాలు ఉన్నా సాగునీరు లేక రైతులు అవస్థలు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. సోమవారం పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో రైతులకుసాగు నీరు అందించడానికి నాలుగు ఎత్తిపోతల పథకాలు ఉన్నప్పటికి ఒకటి మాత్రమే పని చేస్తోందన్నారు. రైతులకు సకాలంలో సాగునీరు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. 2009లో వరదల్లో ముంపులో సర్వం కోల్పోయిన బాధితులకు పునరావాసం కల్పిస్తామని ఇప్పటికి ప్రభుత్వం చర్యలు చేపట్టలేదన్నారు. వరద బాధితులకు పట్టాలిచ్చిన్న ఇప్పటికి స్థలాలు చూపలేదన్నారు. ఖాళీ స్థలాల్లో ఇళ్ల నిర్మించుకోవడానికి ప్రభుత్వం రూ.3 లక్షలు రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. చిన్నోనిపల్లి రిజర్వాయర్ పేరుతో రైతుల భూములను లాక్కోవడం అన్యాయమన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి నరసింహ, దేవదాసు, ఈదన్న, నాగరాజు, బంగారు రఫీ తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ల గ్రామ కమిటీ ఎన్నిక



అలంపూర్ రూరల్: ట్రాక్టర్ డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. మండలంలోని క్యాతూర్‌లో సోమవారం ట్రాక్టర్ డ్రైవర్ల గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా జి. నాగరాజు, రవికుమార్, కోశాధికారిగా నరసింహ, ఉపాధ్యక్షుడిగా ఈ నర్సింహ, సహాయ కార్యదర్శిగా రాముడులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నర్సింహ మాట్లాడుతూ ట్రాక్టర్ డ్రైవర్లకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కన్వీనర్ జీకే ఈదన్న, డీవైఎఫ్ మండల కార్యదర్శి ఆలీ అక్బర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



పాఠశాల ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం సోమవారం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంఈఓ శివప్రసాద్ హాజరై మాట్లాడారు. తరగతి గది నుంచే దేశ భవిష్యత్ నిర్మితమవుతుందన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు మద్దిలేటి, ఉపాధ్యాయులు మనోహర్ రెడ్డి, సుందర్ రెడ్డి, మద్దిలేటి, రాజగోపాల్ రెడ్డి, భరత్ కుమార్, ప్రసన్న, అరుణప్రభావతి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల నిర్మించండి

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ శివారులోని అగ్రికల్చర్ ఫామ్‌హౌస్‌లో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల నిర్మించి జిల్లాలోని విద్యార్థులకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కొంకల భీమన్న, మస్తాన్ మాదిగ, రాజు మాదిగలు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. జూలెకల్ ఫామ్‌హౌస్‌లోని సర్వేనంబర్ 278లో సుమారు 42 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు నాగర్‌కర్నూల్‌జిల్లాలోని పాలెంకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక్క కళాశాల ఉన్నందున సీట్లు లేక చాలా మంది విద్యార్థులు కోర్సుల్లో చేరడానికి అవకాశంలేక ఇతర కోర్సుల్లో చేరుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, అలంపూర్ ఎమ్మెల్యే స్పందించి జూలెకల్ ఫామ్‌హౌస్‌లో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు కృషిచేయాలని వారు కోరారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ

ధరూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 1996–97 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పరీక్షకు అవసరమయ్యే ప్యాడ్, పెన్నులు, పెన్సిల్, స్కేల్‌తో పాటు వివిధ విద్యా సామగ్రిని సమకూర్చారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో 150 మంది విద్యార్థులకు విద్యాగ్రిని అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ 10/10 సాధించిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బండ్ల వెంకటేశ్వరరెడ్డి, జగదీష్, రాజేష్, ప్రవీణ్, మహబూబ్, రాముడు, అంజి, మునీర్, తిరుమల్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షల కిట్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రైతులను అరెస్ట్ చేయడం దుర్మార్గం



గద్వాల అర్బన్: చిన్నోనిపల్లి రిజర్వాయర్‌ను రద్దు చేయాలని ధర్నా చేపడుతున్న రైతులను పోలీస్‌స్టేషన్లలో బంధించి, పోలీసు బలగాలను పెట్టి రిజర్వాయర్ పనులను ప్రారంభించడం సమంజసం కాదని వైఎస్సార్‌టీపీ కో-ఆర్డినేటర్ అతికూర్ రహ్మాన్ అన్నారు. సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నోనిపల్లి, బోయిలగూడెం, ఇందువాసి, చాగదోణ గ్రామాల రైతులు 425 రోజులుగా నిరసనలు చేస్తున్న రైతులను రాత్రివేళ అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. ఎలాంటి ప్రయోజనం లేని రిజర్వాయర్ రద్దు చేసి, పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన ఆటో: పలువురికి గాయాలు



దెబ్బతిన్న ఆటో

శాంతినగర్: ఆటో అదుపుతప్పి తండ్రి, కొడుకులతో పాటు పలువురికి గాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుల వివరాల ప్రకారం కర్నూలు వీరేంద్రనగర్‌కు చెందిన కిష్టన్న కుటుంబసభ్యులు అయిజ మండలం చిన్నతాండ్రపాడుకు పని నిమిత్తం స్వంత ఆటోలో వెళ్లారు. తిరిగి కర్నూలుకు వెళ్తుండగా మార్గమధ్యలో జూలెకల్ సమీపంలో ఆటో అదుపుతప్పి చెట్టును ఢీకొని బోల్తాపడింది. సంఘటనలో తండ్రి కిష్టన్న కొడుకులకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులకు స్వల్పగాయాలయ్యాయి. బాధితులను 108లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై శాంతినగర్ ఎస్‌ఐని వివరణ కోరగా బాధితులు ఫిర్యాదు చేయలేదని తెలిపారు. బాధితులను 108లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కొనసాగుతున్న ‘కంటి వెలుగు’



అయిజ కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



ఉదండాపురంలో కంటి వెలుగును పరిశీలిస్తున్న ప్రోగ్రాం అధికారి దివ్య

గట్టు: మండలంలోని గోర్లఖాన్‌దొడ్డిలో కంటివెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ బాసు శ్యామల ప్రారంభించారు. సోమవారం గొర్లఖాన్‌దొడ్డి, బోయలగూడెం గ్రామాల్లో నిర్వహించిన కంటివెలుగులో మొత్తం 304 మందికి కంటి పరీక్షలను నిర్వహించినట్లు సీహెచ్‌ఓ ఊసేని తెలిపారు. ఇందులో 25 మంది కంటి అద్దాలను పంపిణీ చేశారు. 11 మందికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, నరేష్, హెల్త్ సూపర్‌వైజర్ మక్బూద్ పాల్గొన్నారు.

అయిజ: మున్సిపాలిటీలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో 11 వార్డు ప్రజలు పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం మున్సిపల్ చైర్మన్ చిన్నదేవన్న, వైస్ చైర్మన్ మాల నరసింహులు శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉచితంగా మందులు, కళ్లజోడు అందజేస్తారని,శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ వార్డుల కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉండవెల్లి: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బజరన్న అన్నారు. సోమవారం మండలంలోని తక్కశిల, మెన్నిపాడు గ్రామీణులకు పరీక్షలు నిర్వహించారు. మెన్నిపాడులో 123, తక్కశిలలో 129 మందికి కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమం కొనసాగింది. క్యాతూర్ పీహెచ్‌సీలోని ఉట్కూర్‌లో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 57 మంది పురుషులు, 72 మంది మహిళలు మొత్తం 129 మంది పరీక్షలు చేయించుకున్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి డాక్టర్ దివ్య సూచించారు. సోమవారం ఇటిక్యాల మండలంలోని ఉదండాపురంలో కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కంటి అద్దాలను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటరాజన్, మండల వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రం తనిఖీ

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హృదయరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మొత్తం 85 మంది విద్యార్థులకు 78 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహులు, డిపార్ట్‌మెంటల్ అధికారి రాజేశ్వర్‌లు తెలిపారు.

అయిజ: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష కేంద్రాలను సోమవారం నోడల్ ఆఫీసర్ హృదయరాజు, డీఈసీలు దేవేందర్‌రెడ్డి, రామేశలింగంలు పరిశీలించారు. మండల కేంద్రంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1019 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 79 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు ఉన్నారు.

బహుజన రాజ్యాధికారమే లక్ష్యం



కేటీదొడ్డి మండలంలో పాదయాత్ర చేస్తున్న గొంగళ్ల రంజిత్ కుమార్

కేటీదొడ్డి: బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా ప్రజలను చైతన్యం చేస్తున్నామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ అన్నారు. సోమవారం ఆత్మ గౌరవ పాదయాత్రలో భాగంగా మండలంలోని చింతలకుంట, సోంపురం, కుచినెర్ల, నందిన్నె, గువ్వలదిన్నె, ఇర్కిచేడు, ఇరికిచేడు తండా, వెంకటాపురం గ్రామాల మీదుగా సాగింది. ఆయా గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకలను గెలిపించాలని కోరారు. బహుజనులు ఏకతాటిపైకి రావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, కార్యదర్శి లవన్న, నాయకులు గోవిందు, ఎల్లేష్, నాగేష్, వీరేష్, రంగస్వామి, భీమేష్ గౌడ్, ఏసన్న, రాము, విష్ణు, ప్రేమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

గద్వాల అర్బన్: కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంజిపేట రాజు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గంజిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వ పాలన గాడి తప్పిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కేజీబీవీ, యూఆర్‌ఎస్, మోడల్ స్కూల్ వర్కర్ల పర్మినెంట్, ఆటో కార్మికులకు సామాజిక భద్రతతో పాటు సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 25, 26, 27వ తేదీల్లో మంచిర్యాల పట్టణంలోని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతకుముందు ఈ సదస్సులకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ఉపాధ్యక్షుడు హైమద్ ఖాన్, నాయకులు గణేష్, వెంకటేష్, నర్సింహ్మ, మన్యం, సాయి, గోపి, పద్మమ్మ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

పుస్తకాలు అందజేత



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దాత

శాంతినగర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ చదువుతున్న విద్యార్థులకు మానవపాడు మండలం అమరవాయి గ్రామానికి చెందిన అల్లంపల్లి రవికుమార్ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు సోమవారం పంపిణీ చేశారు. రవికుమార్ తల్లి అల్లంపల్లి లక్ష్మీదేవి జ్ఞాపకార్థం రూ.6 వేల విలువగల పుస్తకాలు కామర్స్ విద్యార్థులకు అందజేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డా.పాషయ్య దాతను సన్మానించారు. కార్యక్రమంలో కామర్స్ విభాగం అధ్యాపకులు బీసన్న, మహేష్, కామర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మనోరమ

అలంపూర్: పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలను మున్సిపల్ చైర్‌పర్సన్ సందర్శించారు. జెడ్పీహెచ్‌ఎస్ న్యూప్లాట్స్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో పరీక్షల ప్రిపరేషన్‌పై మాట్లాడారు. ఇన్‌చార్జీ హెచ్‌ఎం సాయిప్రకాష్‌తో సమావేశమై చర్చించారు. న్యూప్లాట్స్‌లోని ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించారు. హెచ్‌ఎం సువిజ్ఞానం, ఉపాధ్యాయులు నజీమా, ఆదాంబీ, భారతి, సాయిప్రకాష్, స్వరాజ్ బాబు ఉన్నారు.

రైతుల అరెస్టు అప్రజాస్వామికం

గద్వాల: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా చిన్నోనిపల్లి రిజర్వాయర్ పునఃప్రారంభం కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీజేపీ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, బండల వెంకట్రాములు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రిజర్వాయర్ పునః ప్రారంభంతో ఒరిగేమీలేదన్నారు. జిల్లాలో గ్రామాల మధ్య విభేదాలు సృష్టించి చిచ్చుపెట్టేలా ప్రభుత్వ వ్యవహరిస్తుందని ఆరోపించారు.

ఏప్రిల్ 2వ తేదీ నుంచి చేనేత భరోసా యాత్ర

ఏప్రిల్ 2వ తేదీ నుంచి చేనేత భరోసా యాత్ర నిర్వహిస్తునట్లు బీజేపీ చేనేత సెల్ రాష్ట్ర కన్వీనర్ యెన్నం శివకుమార్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన చేనేత సెల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జోగుళాంబ అమ్మవారి సన్నిధి నుంచి యాత్రను ప్రారంభించి, రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో రామలింగేశ్వర్ కాంమ్లే, రామకృష్ణ, పులిపాటి వెంకటేష్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్: బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జిల్లా సహ ఇన్‌చార్జ్ తూళ్ల వీరేంద్రగౌడ్ అన్నారు. సోమవారం వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో అలంపూర్ నియోజకవర్గ బూత్‌స్థాయి స్వశక్తికరణ్ అభియాన్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేంద్రగౌడ్ మాట్లాడుతూ శక్తి కేంద్ర ఇనచార్జీలు, శక్తి కేంద్ర విస్తారకులు ప్రతి కేంద్రంలో బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎడ్యుకేషనల్ కన్వీనర్ బంగి లక్ష్మణ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, కేకే రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్, అలంపూర్ అసెంబ్లీ కన్వీనర్ మెడికల్ తిరుమల్‌రెడ్డి, ఎస్సీ మోర్చా మాదన్న, జిల్లా కార్యదర్శి స్వప్న, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్నగడ్డం కృష్ణారెడ్డి